# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-01-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న దేశభక్తి భావితరాలకు స్ఫూర్తినిచ్చాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శనీయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ చెప్పారు.**

3. **త్వరలో నంది అవార్డులను ప్రదానం చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

4. **సంక్రాంతి పండుగ నేపథ్యంలో 10 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.**

5. **36వ విజయవాడ పుస్తక మహోత్సవం రేపటితో ముగియనుంది.**

==========================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటనలో భాగంగా సోమనాథ్‌లో నిర్వహించిన శౌర్య యాత్రలో ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విదేశీ దురాక్రమణ దారుల నుంచి సోమనాథ్ ఆలయాన్ని రక్షించే క్రమంలో ప్రాణాలు అర్పించిన వారికి ప్రధానమంత్రి నివాళులర్పించారు. అనంతరం సోమనాథ్ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ...

వాయిస్...27 సెకన్లు

---

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం కంటె ముందే దక్షిణ భారత దేశంలో బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధులు వడ్డే ఓబన్న జయంతి ఈ రోజు. ఓబన్న కర్నూలు జిల్లాలోని రేనాటి ప్రాంతంలో 1807 జనవరి 11న జన్మించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధ్యక్షులుగా ఓబన్న ముఖ్య పాత్రను పోషించారు. 10 వేల మందితో సంచార తెగల సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బ్రిటిష్ సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆయన చేసిన పోరాటం గురించి తెలియజేసేందుకు వడ్డే ఓబన్న జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది.

---

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న దేశభక్తి భావితరాలకు స్ఫూర్తినిస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. అనంతపురంలో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొని వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయవాడలో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, చిత్తూరులో కలెక్టర్ సుమిత్ కుమార్‌లు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015లో ప్రారంభించిన ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ ప్రగతి వేదిక 50వ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించి కీలక మైలురాయిని చేరుకుంది. ఈ వేదిక ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మంత్రిత్వ శాఖలు కలిసి మౌలిక వసతుల ప్రాజెక్టులపై నేరుగా ప్రధానమంత్రి స్థాయి పర్యవేక్షణతో నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ప్రగతి కింద రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన జబల్పూర్-గోండియా గేజ్ మార్పిడి ప్రాజెక్ట్‌పై 2016లో సమీక్ష నిర్వహించారు. సుమారు 285 కిలోమీటర్ల పొడవున ఒక వెయ్యి 9 వందల 91 కోట్ల రూపాయలతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతులు, భూసేకరణ సమస్యలతో ఆలస్యమైంది. ప్రగతి సమన్వయంతో అటవీ, భూ సమస్యలు పరిష్కరించడంతో పనులు వేగవంతమైయ్యాయి. చివరికి 2021 మార్చిలో ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో ప్రారంభమై, మధ్యప్రదేశ్--మహారాష్ట్ర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ రైల్వే మార్గంగా సేవలందిస్తోంది.

---------------------------

స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శనీయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రేపు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా విజయవాడలోని రాఘవయ్య పార్క్ నుంచి మారథన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2047 వికసిత్ భారత్ సాధన దిశగా యువత కోసం అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భారతదేశ విశిష్ఠతను ప్రపంచానికి చాటిచెప్పి, యువ శక్తికి స్వామి వివేకానంద స్ఫూర్తిగా నిలిచారని మంత్రి సత్య కుమార్ వివరిస్తూ....

వాయిస్.. 30 సెకన్లు

తిరుపతిలో 5కే యువ మారథన్‌ను శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆత్మవిశ్వాసం, సేవా భావంతో జీవించాలని చెప్పిన గొప్ప వ్యక్తుల్లో స్వామి వివేకానంద ఒకరని కొనియాడారు.

---------------------------

త్వరలో నంది అవార్డులను ప్రదానం చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విజయవాడలోని పున్నమి ఘాట్ వేదికగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న “అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం డిసెంబరు 17, 18, 19 తేదీల్లో విజయవాడలో మరోసారి “అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలియజేస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

-------------------------

నెల్లూరు నగరాన్ని స్మార్ట్ నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆధునీకరించిన ఫ్లై ఓవర్ ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మించినట్లు చెప్పారు. నగరానికి వరద ముంపును నివారించే లక్ష్యంతో 50 కోట్ల రూపాయలతో కాలువల ఆధునీకరణ పనులు చేస్తున్నట్లు వివరించారు.

-------------------------

వైఎస్ఆర్ కడప జిల్లా చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా అత్యంత వైభవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గండికోట ఉత్సవాలు -2026ను నిర్వహిస్తోంది. ఈరోజు నుండి మూడు రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలలో భాగంగా సాయంత్రం శోభాయాత్ర, గండికోట వారసత్వ ఘన చరిత్రపై గేయాలు, గండికోట థీమ్ డ్యాన్స్, థిల్లానా కూచిపూడి నృత్యం, కవి సమ్మేళనం, లేజర్ సౌండ్ షో, నేపథ్య గాయని మంగ్లీ సంగీత కచేరీ, స్కై లాంతర్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-------------------------

సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్, విజయవాడ మార్గంలో 10 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఈనెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం, ఈ నెల 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం సమయాల్లో విజయవాడ నుంచి హైదరాబాద్ కు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.

-------------------------

విజయవాడ బందరు రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ విజయవాడ పుస్తక మహోత్సవం జరుగుతోంది. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈరోజు పుస్తక మహోత్సవ్‌లో మంచి కంటి రచన 'అంబేద్కర్ మనవాడు' పుస్తకావిష్కరణ సభ, చిన్నారుల కోసం జన విజ్ఞాన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 22వ తేదీన ప్రారంభమైన పుస్తక మహోత్సవం ముగియనుంది.

-------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ...

వాయిస్...20 సెకన్లు

=====================